క్లుప్తంగా

ఎంపీడీఓను కలిసిన బీజేపీ నాయకులు



పూలబొకే అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంగెం : ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌రావును బీజేపీ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి ఆధ్వర్యంలో ఎంపీడీఓకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మెలుగూరి శ్రీనివాస్, తక్కలపల్లి వెంకటేశ్వర్‌రావు, సమ్మిరెడ్డి, కృష్ణ, ముకుందం, నరేందర్, ఎల్లగౌడ్, సతీష్, మహేందర్, చంద్రశేఖర్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు వేణువంక శంకర్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ముస్కు రాజు, గంగాడి అశోక్‌రెడ్డి, శ్రీరామోజు భిక్షపతి, లోనె తిరుపతి, వేముల భగవాన్‌రెడ్డి, బుగ్గ బచ్చయ్య, రమేష్, లింగమూర్తి, వేణు, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

సంగెం : మండలంలోని బీకోజీ నాయక్ తండాలో విర్బాక్ యనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్థికసాయంతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తండా వాసులందరు పరిశుభ్రమైన నీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

విరాళం



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ ధ్వజస్తంభ ఏర్పాటుకు గ్రామానికి చెందిన జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ రూ1.50లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు కుటుంబ సమేతంగా నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి : మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పానీష్‌తండాకు చెందిన భుక్యా గోవింద్‌నాయక్ మృతిచెందగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు మంగళవారం పరామర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహా నాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచ్ భద్రునాయక్ తదితరులు ఉన్నారు.

సంగెంలో..

సంగెం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులను రాష్ట్ర రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు మంగళవారం పరామర్శించారు. గవిచర్ల మాజీ సర్పంచ్ పత్తిపాక రమేష్ భార్య స్వరూప, ఆశాలపల్లి గ్రామానికి చెందిన కొడిపల్లి రాజు వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా బాధితులను నాగుర్ల పరామర్శించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన చిన్నపెల్లి ఏలియా(41) మద్యానికి బానిసై కుటుంబ పోషణకు డబ్బులు ఇవ్వకపోవడంతో విసిగిపోయిన అతడి భార్య మందలించడంతో సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య యశోద, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలియా కూలి పని చేసేవాడు. నిత్యం మద్యం తాగి ఇంటికి రావడం, కూలీ డబ్బులు ఇంట్లో ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ విషయమై భార్య యశోద సోమవారం అతడిని మందలించడంతో పాటు తన కుమారుడిని తీసుకుని పక్కనే ఉన్న చెల్లి ఇంటికి వెళ్లి పడుకుంది. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి రేకుల పైకప్పు రాడ్‌కు ప్లాస్టిక్ తాడుతో ఉరేసుకుని ఏలియా ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.



గీసుకొండ: జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు



దుగ్గొండి: తొగర్రాయి నుంచి సభకు వెళ్తున్న ఎంపీపీ, కార్యకర్తలు



నెక్కొండలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



నర్సంపేట: బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్



నల్లబెల్లి: ముచ్చింపులలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఊడుగుల ప్రవీణ్ గౌడ్

ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ

- ఉత్సాహం నింపిన ప్లీనరీ
- తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

నర్సంపేట : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్లీనరీ సమావేశం నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ప్లీనరీ కోసం ప్రత్యేక వంటకాలను తయారు చేయించి కార్యకర్తలు, నాయకులు వడ్డించారు. పలు సమస్యలను ప్లీనరీలో ప్రవేశపెట్టగా మిగతా సభ్యులు నాయకులు, కార్యకర్తల సమక్షంలో తీర్మానించారు. దీంతో ప్రతీ ఒక్కరు హర్షం వ్యక్తం చేశారు. ప్లీనరీ సమావేశంతో నర్సంపేటలో గులాబీ మయంగా మారింది. బీఆర్ఎస్ ప్లీనరీలో ప్రముఖ రచయిత, గాయకుడు నెల్లుట్ల సుమన్ రాసిన రెండు పాటల సీడీని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.

నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ జెండా పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని 24వార్డులలో ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ప్లీనరీకి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు గులాబీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా నర్సంపేటలో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలివెళ్లారు.



దుగ్గొండి: ప్రభ బండితో..



నర్సంపేట రూరల్: ఆకులతండాలో..



బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



నర్సంపేట: ప్లీనరీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ప్రభలతో ప్లీనరీకి తరలిన కార్యకర్తలు

దుగ్గొండి : నర్సంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీకి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు మంగళవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తొగర్రాయి నుంచి బీఆర్ఎస్ ప్రభ బండిని తరలించారు. జెండా పండుగను పురస్కరించుకుని 34గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల పరిధిలో జెండా ఆవిష్కరణలు చేశారు. మండల కేంద్రంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వెంకటనర్సయ్యల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

సంగెంలో..

సంగెం : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో జెండా పండుగను నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో జెండాను గ్రామపార్టీ అధ్యక్షులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జెండా ఆవిష్కరణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని 27గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు జెండావిష్కరణ చేశారు. మంగళవారం నర్సంపేట పట్టణంలో నిర్వహించే ప్లీనరీ సమావేశాలకు ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో బైక్ ర్యాలీలపై తరలివెళ్లారు.

వరంగల్(పర్వతగిరి) : మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు రంగు కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మెరుగు వెంకన్న జెండా ఆవిష్కరించారు.

గ్రామ గ్రామాన బీఆర్ఎస్ జెండాలు

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను మంగళవారం ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిన బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ : బీఆర్ఎస్ ప్లీనరీకి మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు మంగళవారం తరలి వెళ్లారు. అంతకు ముందు మండల వ్యాప్తంగా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నర్సంపేటలో జరిగే ప్లీనరీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, నాయకులు రవీందర్‌రెడ్డి, వేణు, శ్రీనివాస్, సత్యం, రవి, యాకూబ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



రాయపర్తిలో..



ఖానాపురం: రంగాపురంలో



చెన్నారావుపేటలో..



పర్వతగిరిలో..



సంగెం: కాట్రపల్లిలో..



ఖానాపురంలో..

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు ప్రత్యేక డ్రైవ్

గీసుకొండ : మండలంలోని శాయంపేటహవేలిలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం నుంచి చేపడుతున్నారు. ఈ డ్రైవ్ నెల రోజుల పాటు కొనసాగుతుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ప్రధాన రహదారి, చింతలపెల్లి రైల్వే స్టేషన్ పరిసరాలు, గ్రామంలోని రోడ్లు, కూడళ్లు, పలు షాపుల వద్ద వాడి పడవేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తదితరాలు సేకరిస్తామని సర్పంచ్ రాజబోయిన రజితభిక్షపతి తెలిపారు. గ్రామపంచాయతీ వద్ద ప్లాస్టిక్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గ్రామస్తులు తమ ఇళ్లవద్ద ఉన్న ప్లాస్టిక్‌ను తీసుకుని వస్తే కొనుగోలు చేస్తామన్నారు. నిర్లక్ష్యంగా ప్లాస్టిక్‌ను బయట పడేసే వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మల్టీపర్పస్ వర్కర్లు, వార్డు సభ్యులు, సిబ్బందితో చేపడుతున్న ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. ఉపసర్పంచ్ అరుణ, పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికర్‌బాబు, కారోబార్ కనకాచారి, పాల్గొన్నారు.



సేకరించిన ప్లాస్టిక్‌తో గ్రామస్తులు, వర్కర్లు

షర్మిల అరెస్టు అప్రజాస్వామికం

శాయంపేట : ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో అటవిక పాలన నడుస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సిట్ అధికారులను కలిసేందుకు వెళ్తున్న షర్మిలను అడ్డుకోవడం శోచనీయమన్నారు.

మలేరియా నిర్మూలన ర్యాలీ

గీసుకొండ : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు వైద్యులు, సిబ్బంది మంగళవారం మలేరియా నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పరిసరాల పరిశుభ్రతతో మలేరియా రహిత సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. డాక్టర్లు మాధవీలత, షార్విన్, రేవతి, సీహెచ్‌ఓ బి.మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎస్ కిరణ్‌కుమార్, పద్మ, స్వరూప, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



గీసుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంటి వెలుగును వినియోగించుకోవాలి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ లింగాల విజయ అన్నారు. మండలంలోని గొల్లపెల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహ్మద్ పాషా, ఉప సర్పంచ్ మైల సతీష్, వార్డు సభ్యులు రవి, రమేష్, మాధవి, ఏఎన్ఎం కరుణశ్రీ, యాకలక్ష్మి, ఆశ వర్కర్లు అరుణ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ (పర్వతగిరి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బాదావత్ జ్యోతిరవి అన్నారు. ఈ మేరకు మండలంలోని మోత్యా తండాలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దీప్లా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

అవగాహన

దుగ్గొండి : రైతులు సకాలంలో తమ అప్పులు రెన్యూవల్ చేసుకుంటే అప్పు భారం తగ్గుతుందని ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ వేణుధనుంజయ అన్నారు. మొండి బకాయిలుగా ఉంటే అప్పు విపరీతంగా పెరిగి మోయలేని భారం అవుతుందన్నారు. మండలంలోని చలపర్తిలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక బీమా పథకాలలో చేరడం వల్ల భద్రత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముదరకోల శారద, విజేందర్, జ్యోతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వేణుధనుంజయ

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశానికి తరలి వెళ్తున్న రేషన్ డీలర్లు

నెక్కొండ : రేషన్ డీలర్లు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని నెక్కొండ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గోరంట్ల వెంకట్‌నారాయణ డిమాండ్ చేశారు.ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం తమ డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన గౌరవ వేతన సభకు తరలుతున్న క్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కమీషన్‌ను సైతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. తమ డిమాండ్లను సాధించుకునే వరకు పోరాడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో అధిక ప్రయోజనాలు

- తొలకరికి ముందే లోతుగా దున్నుకుంటే మేలు



సీహెచ్. యాకయ్య, ఏఓ

సంగెం : వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. పురుగులు, తెగుళ్లు, కలుపును నివారించుకోవడంతో పాటుగా భూమి పొరల్లో వర్షపు నీరు ఇంకి పంటలకు ఉపయోగపడుతుంది. వేసవిలో లోతైన దుక్కుల అవసరం, ఉపయోగాలపై సంగెం మండల వ్యవసాయాధికారి సీహెచ్. యాకయ్య పలు సలహాలు, సూచనలు అందజేశారు.

రైతులు సాధారణంగా వేసవి దుక్కులను అడ్డం, పొడవు సాళ్లతో దున్నుతారు. అలా కాకుండా వేసవి దుక్కులను ఏటవాలుగా దున్నడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతుగా దున్నేటప్పుడు భూమి లోపలి పొరల్లోని క్రిమికీటకాలు బయటకు వచ్చి సూర్యకిరణాలు తగిలి చనిపోతాయి. ఏప్రిల్ చివరి వారం, మే మొదటి వారంలో వేసవి దుక్కులు దున్నితే తొలకరి వర్షాలు కురిసినపుడు విత్తనాలు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటాయి. తొలకరి వర్షాలకు ముందే రెండు సార్లు దున్నినట్లయితే భూమి గుల్లబారడంతో పాటు కలుపును కూడా నివారించుకోవచ్చును.

ఉపయోగాలు..

- వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల గట్టిగా ఉన్న భూమి గుల్లబారుతుంది. తద్వారా వర్షాలు పడినపుడు భూమిలోకి నీరు చొచ్చుకు పోయే స్వభావం, నీటిని నిల్వ చేసుకునే ప్రభావం పెరుగుతుంది.
- వేసవిలో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో మార్పు వస్తుంది. భూమి చల్లబడటం, ఆరిపోవడం వంటివి జరిగి విత్తుటకు అనుకూలంగా భూమి నిర్మాణంలో మార్పు వస్తుంది.
- లోతైన దుక్కి వల్ల భూమి పొరల్లోకి గాలి చేరుతుంది. దీని వల్ల సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. దీంతో భూమిలో ఉండే పోషకాలను మొక్క గ్రహించడానికి అనుకూలంగా ఉంటుంది.
- లోతు దుక్కుల వల్ల భూమిలోకి గాలి చేరి గత పంటలకు సంబంధించిన కలుపు, పురుగు మందుల అవశేషాలకు, హానికరమైన అవశేషాలకు మొక్కలు లోనుకాకుండా నిరోధిస్తుంది.
- వర్షాలు పడినపుడు భూమికి వర్షపు నీటిని తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. గాలిలో ఉన్న నత్రజని వర్షపు నీటితో కలిసి భూమిలో చేరడం వల్ల భూసారం పెరుగుతుంది.
- కలుపు, తెగుళ్లకు సంబంధించిన కోశస్థ దశ, మైసీలియంలు భూమి లోపలి పొరల్లో ఉంటాయి. వేసవి దుక్కులు లోతుగా దున్నినపుడు భూమి పై పొరలు తిరగబడి పురుగు గుడ్లు, ప్యూపాలు పైకి వచ్చి సూర్య కిరణాల వేడికి చనిపోతాయి. దీనివల్ల రైతులు పురుగుమందులు, తెగుళ్ల మందులపై పెట్టే ఖర్చులు తగ్గించుకోవచ్చును.
- లోతు దుక్కుల వల్ల మట్టి ద్వారా సంక్రమించే పురుగులు, చీడపీడలను నివారించవచ్చును.
- మొక్క పరాన్న జీవులు, నిమటోడ్స్ భూమిలోనే ఉంటాయి. తద్వారా వేసే పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిమటోడ్స్‌ను నివారించడానికి రైతులు ఎక్కువగా ఖర్చును పెట్టాల్సి వస్తుంది. కానీ వేసవిలో లోతు దుక్కులు చేసినట్లయితే దీనిని అధిగమించవచ్చు.
- భూమిని ఏటవాలుగా దున్నడం వల్ల కోతకు గురికాకుండా ఉంటుంది.
- పంటలకు హానికలించే బ్యాక్టీరియా, శిలీంద్రాలను నాశనం చేయవచ్చు.



ఆశాలపల్లిలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

ఘనంగా వార్షికోత్సవం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ఉదయశ్రీ పాఠశాలలో 30వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ప్రధానోపాధ్యాయులు నిమ్మని అనితజగదీశ్వర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభించిన 30సంవత్సరాలలో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, టీచర్లు, అలాగే విదేశాలలో వేలాది మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగాలలో స్థిరపడ్డారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, డైలీ టెస్ట్, వీక్లీ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.